క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తిరుపతిని మాజీ సర్పంచ్ జాజిమొగ్గ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. నాయకులు చౌదరి తిరుపతి, నగునూరి శ్రీనివాస్, పొట్టె సత్యనారాయణ, అయూబ్, పాలె సంజీవ్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ పుస్తకాలు చదివించాలి

కెరమెరి: ప్రతీరోజు విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలను చదివించాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నీంగూడ, ఆగుర్‌వాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. హెచ్‌ఎం తిరుమల, గంగాసాగర్ తదితరులు ఉన్నారు.

కంచన్‌పల్లి ఆశ్రమ పాఠశాల తనిఖీ

లింగాపూర్: కంచన్‌పల్లి ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ పెద్దిరాజు, ఆర్‌ఐ ప్రదీప్‌లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్యస్థితిని తెలుసుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

బెజ్జూర్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై సునీత సూచించారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహం, జెడ్పీ పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థుల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థినులు ఈవ్‌టీజింగ్‌కు గురైతే 100కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రత్యేక అధికారి అరుణ, రమాదేవి, శ్రీనివాస్, స్వప్నలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రవక్త మొహమ్మద్ జీవనం ఆచరణీయం



జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆసిఫాబాద్‌అర్బన్: మొహమ్మద్ ప్రవక్త జీవనం ప్రపంచ మానవాళికి ఆచరణీయమని ముస్లిం మత పెద్దలు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జామా మసీద్ నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా ఈద్ మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, జామా మసీద్ అధ్యక్షుడు అబ్దుల్ ఫయాజ్, ఉస్మానియా మసీద్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పీఆర్టీయూ సంక్షేమ నిధి అందజేత



చెక్కు అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కౌటాల మండల కేంద్రంలోని పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మిరిదొడ్డి కవిత అనే ఉపాధ్యాయురాలు ఇటీవల అకాల మరణం చెందగా ఆమె కుటుంబానికి శుక్రవారం పీఆర్టీయూ టీఎస్ సంఘం సంక్షేమ నిధి నుంచి రూ.లక్షను సంఘం నాయకులు అందజేశారు. పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు. నాయకులు అనిల్, నర్సింహచారి, రాజు, గణపతి, బిక్షపతి, దేవాజీ, యాదగిరి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాంచందర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆచూకీ లభ్యం

సిర్పూర్(టి): రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయిన మండల కేంద్రంలోని బెస్తకాలనీకి చెందిన యువతి ఆచూకీ అభ్యమైనట్లు ఎస్సై కమలాకర్ శుక్రవారం తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా ఫోన్ లొకేషన్ ఆధారంగా మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో గల బంధువుల ఇంటి వద్ద ఉన్నట్లు గుర్తించామన్నారు. యువతిని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

గిరి పల్లెల్లో కానరాని ప్రగతి

- అధ్వానంగా మారిన రోడ్లు
- వంతెనలు లేక వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు
- రవాణాకు కోట్ల నిధులు మంజూరు
- అటవీ అనుమతులు లేక నిలిచిపోతున్న పనులు



సోమిని నుంచి బెజ్జూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి

బెజ్జూర్: గిరిజనులు నివసించే పల్లెలు ప్రగతికి ఆమడదూరంలో నిలిచిపోతున్నాయి. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలోనైతే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇక వర్షాకాలంలో వీరి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. భారీ వర్షాలు కురిసిన సమయంలో మట్టి రోడ్లు బురదమయంగా మారడం, వాగులు, ఒర్రెలు పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన దుస్థితి నెలకొంది. పల్లెవాసుల రవాణా అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తున్నా నేటి వరకు కూడా రవాణా సౌకర్యానికి నోచుకోవడం లేదు.

అటవీ అనుమతులు లేక..

బెజ్జూర్ మండలంలోని కుష్ణపల్లి నుంచి సోమిని వరకు రోడ్డు సౌకర్యంతో పాటు రెండు వంతెనల నిర్మాణానికి 2017లో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో ఆ పనులు ప్రారంభానికే నోచుకోలేదు. దీంతో వర్షాకాలంలో ఈ మార్గం చిత్తడిగా మారి ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెంచికల్‌పేట మండలం కమ్మర్‌గాం నుంచి మొర్లిగూడ రోడ్డు కోసం నిధులు కేటాయించగా, అటవీ అనుమతులు లేకపోవడంతో ఆ పనులు సైతం నిలిచిపోయాయి. ఫలితంగా ఆ నిధులు వేరే రహదారికి మళ్లించారు. దీంతో మొర్లిగూడ, పాతజిల్లెడ, కొత్తజిల్లెడ గ్రామాల ప్రజలు పెంచికల్‌పేట, బెజ్జూర్‌కు వెళ్లాలంటే 25 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రహదారి కష్టాలు..

మొగవెల్లి నుంచి గూడెం వరకు రోడ్డు పనులు కూడా అనుమతుల సమస్యలతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. నాగేపల్లి, కోయపల్లి, ఇప్పలగూడ, గెర్రెగూడ, మొగవెల్లి, సుశ్మీర్, తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెంచికల్‌పేట మండలంలోని కమ్మర్గాం నుంచి బెజ్జూర్ మండలంలోని హేటిగూడ వరకు రహదారి గుంతలమయంగా మారడంతో వర్షాకాలంలో ప్రయాణం కష్టతరంగా మారుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రవాణా కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

అత్యవసర సమయాల్లో అవస్థలు



జిల్లెడ గ్రామం నుంచి అత్యవసర సమయంలో రోడ్డు సౌకర్యం లేక బెజ్జూర్‌కు, పెంచికల్‌పేట్‌కు వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నారు తప్పా మా గిరిజన గ్రామాల రోడ్లు మాత్రం ఇప్పటివరకు మారడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– మదావి జలపతి, జిల్లెడ

రోడ్డు సౌకర్యం లేదు..



మండల కేంద్రానికి పనుల కోసం పోవాలంటే ఇబ్బందిగా ఉంది. మొత్తం మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలం మోటార్ సైకిల్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. సరిహద్దులో ఉన్న 12 గ్రామాలకు సరైన రహదారులు లేక ఎటు వెళ్లలేక వర్షాకాలంలో అవస్థలు పడుతున్నాం. వంతెనలు లేక, రోడ్డుబాగు లేక గర్భిణులకు అనేక కష్టాలు ఎదురవుతున్నాయి.

– సద్మేక రమేశ్, మొగవెల్లి

ప్రభుత్వాసుపత్రిలో పని చేయని లిఫ్ట్



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో పని చేయని లిఫ్ట్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ గత వారం రోజులుగా పని చేయడం లేదని రోగులు వాపోతున్నారు. గత కొన్ని రోజులుగా సీజనల్ జ్వరాలతో ప్రతీరోజు పదుల సంఖ్యలో రోగులు ఆసుపత్రిలో చేరుతున్నారు. జనరల్ వార్డు 2వ ఫ్లోర్‌లో ఏర్పాటు చేయడం, లిఫ్ట్ పని చేయక పోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రి డీసీహెచ్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు. లిఫ్ట్ మరమ్మతులు చేపట్టి వసతులు మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ కళాబృందం సభ్యులు శుక్రవారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలు, బాల్య వివాహాలతో ముప్పు, రోడ్డు ప్రమాదాల నివారణ, చట్టాలు–శాంతి భద్రత, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో 1930, 100, 1098 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఎస్సై తులసీరాం, కళాబృందం సభ్యులు రోహిత్, రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, రజిత, సంఘవి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

వాంకిడి: నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని బంబార గ్రామంలో 20 మంది పోలీస్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 32 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి, గుడుంబ, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై మహేందర్, కెరమెరి ఎస్సై మధుకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



బాబేఝరిలో రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కెరమెరి: పరిసరాలను శుభ్రంగా ఉంచినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఈవో మెస్రం సోము అన్నారు. శుక్రవారం మండలంలోని మోడి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలతో పాటు బాబేఝరి ఆశ్రమ పాఠశాల, మహరాజ్‌గూడ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. 100 మంది విద్యార్థులతో పాటు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపూతలు సేకరించారు. ఆయా పాఠశాలల్లో, గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. హెచ్‌ఏలు శంకర్, వసంత్, ఏఎన్‌ఎం స్రవంతి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ 33/11కేవీ ఉపకేంద్రంలో నెలవారి మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు గుండి రోడ్డు, టీఆర్‌నగర్, రాజంపేట మినహా మిగతా ఆసిఫాబాద్ టౌన్ మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లక్ష్మీరాజ్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో నెలవారి మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కౌటాల: మండలంలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అంజల్ కుమార్ శుక్రవారం తెలిపారు. నేడు కౌటాల విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

'ఏక్ పేడ్ మాకే నామ్'

పెంచికల్‌పేట్: ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా ఎల్కపల్లి సెంయింట్ ఆంథోని పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ గణేశ్ బిస్వాస్, ఎఫ్‌బీవోలు సతీశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ కార్యవర్గం ఎన్నిక

రెబ్బెన: వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోషియేషన్ బెల్లంపల్లి ఏరియా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోషియేషన్ ప్రెసిడెంట్‌గా ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఎస్వోటూజీఎం రాజమల్లు, చీఫ్ కోఆర్డినేటర్‌గా ఎం. శ్రీనివాస్, గౌరవ కార్యదర్శిగా డి. ప్రశాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సీహెచ్. అశోక్, కోఆర్డినేటర్‌గా నండి అన్వేశ్‌లను ఎన్నుకున్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంపీడీవో కోట ప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని గిరిజన పోస్టు మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. వసతి గృహంలోని మంచినీటి సదుపాయం, నిత్యవసర వస్తువుల నాణ్యత పరిశీలించారు. విద్యార్థులకు జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. సోలార్ వాటర్ హీటర్‌కు మరమ్మతులు చేయించాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. వార్డెన్ వెంకటేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

అన్ని స్థానాల నుంచి పోటీచేయాలి

కెరమెరి: రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో అన్ని స్థానాల నుంచి పోటీ చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జి పెందోర్ మారుతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు సెడ్మకి తుకారాం అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల కార్యశాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

ముగ్గురి అరెస్టు

ఆసిఫాబాద్: ఎలాంటి వైద్య కోర్సులు లేకుండా రోగులకు అలోపతి మందులు ఇస్తూ చికిత్స చేస్తున్న జిల్లా కేంద్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రమేశ్, మధూకర్, రవికాంత్‌లను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ బాలాజీ వరప్రసాద్ తెలిపారు. గత నెల 14న వీరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పోలీసులకు పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్, జీపీఎఫ్, టీఏ బిల్లులను వెంటనే విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో కిరణ్‌కు సీపీఐ జిల్లా నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి, నాయకులు మహేశ్, రాకేశ్ పాల్గొన్నారు.

సంఘమిత్ర సూపర్‌ఫాస్ట్ రైలుకు ఘనస్వాగతం



లోకోపైలెట్‌కు స్వీటు అందజేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో సంఘమిత్ర సూపర్‌ఫాస్ట్ రైలుకు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘన స్వాగతం పలికారు. ధనాపూర్ నుంచి సికింద్రాబాద్ మీదుగా ఎస్‌ఎంవీటీ (బెంగళూరు) వెళ్లే ఈ రైలు శుక్రవారం కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వడంతో శుక్రవారం రాత్రి కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రైలుకు ఘనస్వాగతం పలికారు. లోకోపైలెట్లకు స్వీట్లు తినిపించి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ ఎంపీల సహకారంతో ఇక్కడి రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ లభించిందని పేర్కొన్నారు. త్వరలోనే మరికొన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రైల్వే చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ కైలాస్, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ భాస్కర్, బీజేపీ నాయకులు సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, వీరభద్రచారి, చిప్పకుర్తి శ్రీనివాస్, గజ్జెల లక్ష్మణ్, గట్టు అనిల్ తదితరులు ఉన్నారు.

'సిర్పూర్'కు 1000 టన్నుల యూరియా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: త్వరలోనే సిర్పూర్ నియోజకవర్గానికి 1000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయనున్నట్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు. మంచిర్యాల రైల్వే స్టేషన్‌కు ట్రిప్‌కో యూరియా రైలు వచ్చిన సందర్భంగా శుక్రవారం అన్‌లోడ్ సరళిని పరిశీలించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ గోపితో మాట్లాడి సిర్పూరు నియోజకవర్గానికి యూరియా కేటాయింపు చేయించామని తెలిపారు. మంచిర్యాలకు వచ్చిన రైలు ద్వారా 300 మెట్రిక్ టన్నులు, ఆదిలాబాద్‌కు వచ్చే రైలు ద్వారా 700 వందల మెట్రిక్ టన్నులు సిర్పూరు నియోజకవర్గానికి కేటాయించారని పేర్కొన్నారు. టోకెన్లు పొందిన రైతులకు మొదటగా ప్రాథమిక వ్యవసాయ సంఘాల ద్వారా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. రైతులు నానో యూరియా సైతం ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చప్పిడి సంజీవ్, బావాజీ, బండు, రవితేజ, హరీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియాలో కేంద్ర పర్యావరణ అధికారి పర్యటన



మూసివేసిన గోలేటి-1, 1ఏ మ్యాన్‌వేలను పరిశీలిస్తున్న తరుణ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో శుక్రవారం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమెట్ చేంజ్ సైంటిస్ట్, అడ్వైజర్ తరుణ్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ జీఎం బి.సైదులుతో కలిసి బీపీఏ ఓసీపీ- 2 ఎక్స్‌టెన్షన్, మూతపడిన గోలేటి- 1 ఇన్‌క్లైన్, గోలేటి- 1ఏ గనులను సందర్శించారు. నిబంధనల ప్రకారం ఉండాల్సిన వసతులు పరిశీలించారు. మూతబడిన గోలేటి- 1, 1ఏ గనుల మ్యాన్‌వే, ఎయిర్ షాఫ్ట్, గ్రీన్‌బెల్ట్ రోడ్డు కిరువైపులా భారీగా పెరిగిన వృక్షాలను పరిశీలించారు. బీపీఏ ఓసీపీ- 2 ఎక్స్‌టెన్షన్ గని సమీపంలో సెట్లింగ్ పాండ్, బండరాళ్లతో నిర్మించిన డ్యాం, గోడలు, డంపులపై పెరిగిన వృక్షాలు, నర్సాపూర్ నాలాలు పరిశీలించారు. గోలేటిలోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం సింగరేణి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయని అన్నారు. అనంతరం గోలేటిలోని జీఎం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్వోటూజీఎం రాజమల్లు, గోలేటి ఓసీ పీవో ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి అప్సర్‌పాషా, ఏరియా సెక్యూరిటీ అధికారి శ్రీధర్, మేనేజర్ మహేశ్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్, జూనియర్ ఫారెస్టు అధికారి సుష్మా తదితరులు పాల్గొన్నారు.

'ఏచూరి ఆశయాలు సాధిస్తాం'

కాగజ్‌నగర్‌టౌన్: సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలను సాధిస్తామని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్‌లు పేర్కొన్నారు. ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సంజీవయ్య కాలనీలో శుక్రవారం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశంలో పెరిగిపోతున్న కులమత రాజకీయాలపై పోరాడాల్సిన అవసరముందన్నారు. ప్రజాసంఘాల నాయకులు శంకర్, సంజీవ్, రమేశ్, బాపన్న, జి.రమేశ్, లక్ష్మణ్, తిరుపతి, ప్రియదర్శిని, సత్తమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

భూముల పట్టాలు పునరుద్ధరించాలి



రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బెజ్జూర్: బెజ్జూర్ శివారులోని సర్వే నం.761, 762 భూముల పట్టాలు పునరుద్ధరించాలని మండలంలోని చిన్న సిద్ధాపూర్ గ్రామ రైతులు కోరారు. శుక్రవారం తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం భూప్రక్షాళన సర్వేలో ఈ భూములు ఆన్‌లైన్ నుంచి తొలగించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ దండే విఠల్ చొరవ తీసుకోవాలని కోరారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. రైతులు, మాజీ ఉపసర్పంచ్‌లు శ్రీనివాస్, సిడాం సాంబయ్య, నికూరి నారాయణ, పోచయ్య, వెంకటేశ్, తేజ, లలిత, మహేశ్, రాజు, మేర బాపు, లింగయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో బోధన చేయాలి



విద్యార్థులతో గేయం పాడిస్తున్న ఉద్ధవ్

కెరమెరి: చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలని ఏసీఎంవో పుర్క ఉద్ధవ్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కల్లెగాం గిరిజన ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను ఆంగ్లవర్ణమాల అడిగారు. ఎక్కాలు చదివించారు. ప్రతీరోజు ఆంగ్ల గేయాలు పాడించాలని, రికార్డులు నమోదు చేయాలని హెచ్‌ఎం నైతం నారాయణకు సూచించారు.

మూడుసార్లు ఫొటోలు తప్పనిసరి

కెరమెరి: ప్రతీరోజు ఉపాధ్యాయులు మూడుసార్లు జీపీఎస్ కెమెరాలో ఫొటోలు తీసి గ్రూపుల్లో అప్‌లోడ్ చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి(ఏసీఎంవో) పుర్క ఉద్ధవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉదయం 9, మధ్యాహ్నం12, సాయంకాలం 4 గంటలకు విద్యార్థులతో కలిసి దిగిన ఫొటోలను షేర్ చేయాలన్నారు. ఎంఈవో ఆడే ప్రకాశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రేందాస్, ఎస్సీఆర్‌పీ చహకటి శ్యాంరావు ఉన్నారు.

'కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నాలు'

రెబ్బెన: మండల కేంద్రంలోని పీఏసీఎస్ నుంచి యూరియా బస్తాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు బెదిరించి తీసుకెళ్లినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని కావాలనే కొంతమంది నాయకులు కాంగ్రెస్ పార్టీపై బురద జల్లుతున్నారని పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.